క్లుప్తంగా

టెన్నికాయిట్ పోటీలకు సబ్బవరం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం తిరుపతిరావు తదితరులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మగ్గురు విద్యార్థులు అంతర జిల్లాల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. తిరుపతిరావు మంగళవారం తెలిపారు. జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలురు,బాలికల విభాగంలో టెన్నికాయిట్ జట్ల ఎంపిక నిర్వహించారన్నారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి. అఖిలేష్ కుమార్,బి. గ్రీష్మ,కె. వెంకటలక్ష్మి ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకూ శ్రీకాకుళం జిల్లా పాతపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.వీరిని పాఠశాలలో హెచ్ఎంతో పాటు పీడీ అబ్దుల్ రెహమాన్, పీఎంసీ కమిటీ చైర్మన్ జగ్గారావు తదితరులు అభినందించారు.

మంచినీటికి ఇబ్బందులు



మూతపడిన వాడచీపురుపల్లి ఆర్వో ప్లాంటు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూతపడడంతో ప్రజలు తాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రజల మంచి నీటి అవసరాలు తీర్చడానికి ఎన్టీపీసీ యాజమాన్యం 2010లో సీఎస్సార్ నిధులు రూ.7.50 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసింది. ఈ ఆర్వో ప్లాంటు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, ఊటగెడ్డపాలెం, ఇస్సన్నపేట, వెంకటపతిపాలెం తదితర గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేది. 20 లీటర్ల వాటర్ క్యాను రూ.5 లకే అందించేవారు. ఇటీవల ఆర్వో ప్లాంట్ మరమ్మతులతో మూతపడడంతో గ్రామీణ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు అంచులు



పరవాడ పెట్రోల్ బంకు వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచులు

పరవాడ: పరవాడ-యలమంచిలి రహదారిలో పలు చోట్ల రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు సబ్‌స్టేషన్ నుంచి బొట్టవానిపాలెం వరకు రహదారి పొడవునా మట్టి కొట్టుకుపోవడంతో అంచులు ప్రమాదకరంగా తయారయ్యాయి. పరవాడ-అనకాపల్లి, లంకెలపాలెం-పెదముషిడివాడ, పరవాడ-లంకెలపాలెం రహదారుల్లో కూడా రోడ్డు అంచులు కోతకు గురవడంతో తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచులను గుర్తించి మట్టితో పూడ్చించడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 30 మంది ఎంపిక



ఎంపికైన విస్తం విద్యార్థులు

పెందుర్తి: పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల(విస్తం)లో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 30 మంది ఎంపికయ్యారు. వల్కన్‌టెక్స్ కంపెనీలో వీరికి కొలువు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా వెల్లడించారు. కార్యక్రమంలో వల్కన్ టెక్స్ ఎం.డి ఆకాష్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాది గొటివాడ శివారు బొండవానిపాలెం గ్రామం. ప్రధాన గ్రామానికి కిలో మీటరు దూరం ఉంటుంది. గతంలో గ్రామానికి వెళ్లే విద్యుత్ లైన్ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు లైట్లు ఉండేవి కావు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గొటివాడతో పాటు అనుబంధ గ్రామాలైన బొండవానిపాలెం, సాలాపువానిపాలెంను అనుసంధానం చేస్తూ సుమారు రూ.20 లక్షలతో విద్యుత్ లైన్లు పునరుద్ధరించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.దీనితో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి విద్యుత్ కాంతులతో కనిపిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం

- లగిశెట్టి కుమార్, బొండవానిపాలెం, గొటివాడ శివారు.



గొటివాడ గ్రామ సచివాలయం



అందుబాటులోకి వచ్చిన విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రగతి రేఖ



గొటివాడ పంచాయతీ జనాభా **1,906** మంది	పూర్తయిన అభివృద్ధి పనుల విలువ రూ.**2.04** కోట్లు
శివారు గ్రామాలు: సాలాపువానిపాలెం, బొండవానిపాలెం	కొనసాగుతున్న అభివృద్ధి పనుల విలువ రూ.**1.07** కోట్లు
అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు రూ.**3.73** కోట్లు	

చేపట్టిన పని	ఖర్చు చేసిన నిధులు
గ్రామ సచివాలయం	రూ.25 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23 లక్షలు
విలేజ్ హెల్త్ క్లినిక్	రూ.24.5 లక్షలు
పాఠశాల ఆధునికీకరణ	రూ.20.15 లక్షలు
సామాజిక భవనం	రూ.9.4 లక్షలు
అంగన్‌వాడీ కేంద్రం	రూ.5 లక్షలు
గొటివాడ వాటర్ ట్యాంక్	రూ.12 లక్షలు
ఇంటింటికీ తాగునీటికి	రూ.64 లక్షలు
సీసీ డ్రైన్లు,రోడ్లు,కల్వర్టులకు	రూ.30 లక్షలు
విద్యుత్‌లైన్లు	రూ.20 లక్షలు



రైతు భరోసా కేంద్రం

ప్రతి వీధిలో అభివృద్ధి జాడ

మౌలిక వసతులతో మారిన గొటివాడ రూపురేఖలు

అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం సమీపంలో గొటివాడ గ్రామం ఉంది. గ్రామ జనాభా 1,906 మంది ఉన్నారు. ఈ గ్రామానికి బొండవానిపాలెం,సాలాపువానిపాలెం శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఇవి వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడిన గ్రామాలు.గతంలో గ్రామంలో ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సావాసం చేసేవారు.గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్,డ్రైన్ల వంటి సమస్యలతో ఇబ్బంది పడేవారు. అదే విధంగా ప్రభుత్వ సేవలు, పథకాల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు,నాయకుల చుట్టూ తిరిగేవారు.

నేడు మారిన స్వరూపం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. మండల కేంద్రాలను తలదన్నేలా అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలతో కొత్త కళ వచ్చింది. ప్రజల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని చెబుతున్నారు.



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్



సామాజిక భవనం

అన్నదాతకు భరోసా

రైతులు గతంలో విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ సమాచారం కావాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రా ఏర్పాటు చేయడంతో భరోసా లభించింది. విత్తనాలు, ఎరువులతో పాటు సలహాలు సూచనలు గ్రామంలోనే అందుతున్నాయి.

అభివృద్ధికి పెద్దపీట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజల వద్దకే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందని ద్రాక్షలా అంతంత దూరంలో ఉండేవి. ప్రభుత్వ సేవల సమాచారం తెలుసుకోవాలన్నా.. పొందాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు.ఈ ప్రభుత్వం గ్రామానికి కల్పించిన మౌలికవసతులతో ప్రజలకు భరోసా వచ్చింది. గ్రామంలోనే మినీ మండల సముదాయాన్ని నిర్మించారు. గతంలో ఎంపీపీగా చేసిన నాకు అంతకు మించిన సంతృప్తి ఈ ప్రభుత్వంలో సర్పంచ్‌గా చేస్తున్న నాకు లభించింది.

- సాలాపు మీణ,గొటివాడ సర్పంచ్,సబ్బవరం

తాగునీటి కష్టాలు తీరాయి



గ్రామంలో గతంలో నీటి సమస్య అధికంగా ఉండడంతో తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడేవారం.గ్రామంలోని చేతిబోరుకు వెళ్లి నీరు తెచ్చుకొనేవారం. ప్రస్తుతం గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో మా తాగునీటి కష్టాలు తీరాయి. విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయడంతో జ్వరం వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు గ్రామంలోనే వైద్య సేవలు అందుతున్నాయి.

- బొండా రమణమ్మ, బొండవానిపాలెం

'ఆడుదాం ఆంధ్ర'పై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెందుర్తి, మాడుగుల, గాజువాక నియోజకవర్గాలకు చెందిన పలువురు అధికారులు, పీఈటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ క్రీడాకారులకు తగిన రీతిలో వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. పోటీల నిర్వహణలో ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు.

కళా ఉత్సవ్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్ఎం నాగమల్లేశ్వరరావు తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ నెల 14,15వ తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. సాంప్రదాయ పనిముట్ల తయారీలో విశేష ప్రతిభ కనబరిచిన పిల్లి జితేంద్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ఏక పాత్రాభినయం బాలికల విభాగంలో వెన్నెల మీనాక్షి ద్వితీయ స్థానంలో,బాలుర విభాగంలో పెతకంశెట్టి గ్రీష్మంత్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. త్రీడీ బొమ్మల తయారీలో శరగడం చైత్ర తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు బీవీ రామలక్ష్మిని కూడా అభినందించారు.

గణతంత్ర వేడుకలకు నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు



గణతంత్ర వేడుకల్లో నృత్య ప్రదర్శన చేయనున్న నిర్మల నృత్య నికేతన్ విద్యార్థులు

పెందుర్తి: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా వచ్చే ఏడాది జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చేందుకు చినముషిడివాడలోని నిర్మల నృత్య నికేతన్ విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా నిర్మల నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ బి.విజయజ్యోతి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం తమ సంస్థ నుంచి ఒకరికి ఉండేదన్నారు. ఈ ఏడాది తమ సంస్థ నుంచి ఏకంగా ఆరుగురు కళాకారులకు ఆహ్వానం అందడం ఆనందంగా ఉందన్నారు. వందే భారత్ పోటీల్లో విజేతలుగా నిలిచిన శార్వాణిదేవి, కళ్యాణి, పూర్వజరెడ్డి, పూజితరెడ్డి, కార్తీక, చిరు మేఘన గణతంత్ర వేడుకల్లో ప్రదర్శన కోసం సాధన చేస్తున్నారని వెల్లడించారు. ఈ బృందానికి మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా ఎస్ఎస్ఎస్ జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ప్రముఖ నర్తకి ఇంద్రజ నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేషంగా అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చారు. స్వామివారి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. క్షీరాభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈపూజలు జరిగాయి.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పెందుర్తి: పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు మంగళవారం మధ్యాహ్న భోజనం సమకూర్చారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతగట్ల సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేశారు. విజయదుర్గ ఆటో ఓనర్ కం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్, బ్యాంకులు, పోర్టులు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



గోదాదేవికి తిరువీధిలో హారతి అందజేస్తున్న అర్చకుడు



అప్పన్న ఉత్సవమూర్తులకు బేడా తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడా మండపంలో తిరువీధినిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్ పత్తు ఉత్సవాలు ఏడో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి నామస్మరణలో మునిగితేలారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీ అదిష్ఠింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో వేంచేయజేశారు. దివ్యప్రబంధపారాయణాలు పఠించారు.

వెంకన్న ఆలయంలో...

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో పాశుర విన్నపా పారాయణ చేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి



మేలుకొలుపు ర్యాలీలో భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో దేవాలయాల కేంద్రంగా మంగళవారం మేలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువ జామున మేలుకొలుపు పాటలు, భజన కీర్తనలు ఆలపిస్తూ ప్రతీ కుటుంబానికి ఆయురారోగ్యాలు కలగాలని కోరారు. సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని.. దేవాలయాల కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలకు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతీ గ్రామంలో దేవాలయం కేంద్రంగా మేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహించాలని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు ముత్యాలనాయుడు, లాలం ఈశ్వరరావు, రాజు, రమణాజీ, వీర్రాజు, బి.శ్రీను కె.శ్రీను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రయాణికురాలి ముసుగులో చోరీలు

అల్లిపురం: బస్సులు, ఆటోల్లో ప్రయాణం చేస్తూ తోటి ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులు, నగదు దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెయిందొరపేటకు చెందిన పిల్లా సుభద్ర ఈ నెల 14న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే నిమిత్తం గాంధీబొమ్మ సెంటర్‌లో ఆటో ఎక్కింది. మార్గం మధ్యలో మరో మహిళ ఆటో ఎక్కింది. ప్రయాణం సమయంలో సుభద్ర చేపలు కొనేందుకు ప్లాస్టిక్ కవర్‌తో పట్టుకున్న రూ.16వేలు కవర్‌ను కట్‌చేసి దొంగిలించింది. బాధితురాలు ఆటో దిగిన తరువాత చూసుకుంటే బ్యాగు కత్తిరించి ఉండడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ క్రైం పోలీసులు నిందితురాలు విజయనగరం జిల్లా, కొత్తవలసకు చెందిన గంటా మీనాగా గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు గంటా మీనాపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని తెలిపారు. ఈమె అమాయక మహిళలే టార్గెట్‌గా బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ దొంగతనాలకు పాల్పడుతుందని పోలీసులు పేర్కొన్నారు.